ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 26 మార్చి 2024





ఎస్సీ మోర్చా కో-ఇన్‌చార్జిగా నరేష్

ధర్మపురి, మార్చి 25: బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ ఎస్సీ మోర్చా కో-ఇన్‌చార్జిగా దొనకొండ నరేష్‌ను నియమించారు. ఈ మేరకు ఆయనకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ సోమవారం నియామకపు లేఖను పంపించారు. నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంబరాన్నంటిన

హోలీ సంబరాలు

● వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎస్పీ, జడ్పీ, మున్సిపల్ చైర్ పర్సన్లు ● జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు

జగిత్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే వీధుల్లో సందడి నెలకొంది. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్తూ స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్‌తో పాటు పోలీస్ అధికారులు, జడ్పీ, మున్సిపల్ చైర్ పర్సన్లు దావ వసంత, అడువాల జ్యోతి, పీఎం నరేంద్ర మోదీ, ఎంపీ అర్వింద్ కటౌట్లతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, తదితర ప్రజాప్రతినిధులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. హోలీ హోలీల రంగ హోలీ.. చెమ్మకేలీన హోలీ.. రంగ్ బర్సే.. హోలీ ఆయీరే.. అంటూ జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలోని వీధులన్నీ రంగుల హరివిల్లులను తలపించాయి. ఎటు చూసినా రంగులమయమే అనిపించింది. రహదారులు సైతం రంగులమయమయ్యాయి. ఉదయం నుంచే ఉరకలేసిన ఉత్సాహంతో వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల ప్రజలు రంగులు తీసుకుని వీధుల్లోకి వచ్చారు. కుర్రకారు హుషారుగా బైక్‌లపై షికార్లు చేస్తూ రంగులను చల్లుకున్నారు. కేరింతలు కొడుతూ పోటీతత్వంతో ఒకరిపై ఒకరు పడి రంగులు పులుముకున్నారు. బిగ్గరగా హోలీ అని అరుస్తూ టమాటలు, కోడి గుడ్లను తలపై, శరీర భాగాలపై పగులగొట్టుకున్నారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని స్వీట్లు తినిపించుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


కోరుట్లలో చిన్నారుల కేరింతలు

హోలీ పండుగ ఐక్యతకు చిహ్నం..: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

హోలీ పండుగ ఐక్యతకు చిహ్నమని, జాతీయ సమైక్యతాభావంతో దేశంలో జరుపుకునే సంబరాల్లో హోలీ ఒకటని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. హోలీ పండుగ తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. రసాయన మందులు వాడకుండా ప్రకృతి సహజ రంగులు చల్లుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదకు అందించడమే మా లక్ష్యమన్నారు.

జిల్లా ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలి..
జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులతో కలిసి హుషారుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలన్నారు.

సోదరభావానికి ప్రతీక హోలీ..: ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సోదరభావానికి ప్రతీక హోలీ పండుగ అని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ హోలీ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. హోలీ వేడుకలు సోదర భావాన్ని పెంపొందించడంతో పాటు చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేశాయన్నారు. రంగులు ఎలా కలుస్తాయో మనుషులు కూడా ఐక్యత భావంతో మెలగాలని అన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హోలీ వేడుకల్లో పాల్గొని ఉత్సాహపరిచారు. అలాగే రాయికల్ మండల ఉపాధ్యాయులు, పాత్రికేయులు, పలువురు కుల సంఘాల నాయకులు, విద్యార్థులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం హోలీ వేడులను ఘనంగా నిర్వాహంచారు. పట్టణం, గ్రామాంలోని ప్రధాన వీధులలో కామదహనం చేసిన గ్రామస్థులు ఉదయం హోలీ ఘనంగా నిర్వహించారు. మహిళలు యువకులు గ్రామస్థులు రంగులను చల్లుకొని వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని పద్మశాలి సంఘంతో పాటు వివిధ ప్రాంతాలలో నిర్వహించిన హోలీ వేడుకలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నరింగరావు పాల్గొన్నారు. యువకులు సంఘ నాయకులతో కలిసి రంగుల చల్లి వేడకలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో యువకులు హోలీ వేడుకలో పాల్గొ సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని మున్సిపల్, రెవ్వెన్యూ డివిజన్, పోలీస్ స్టేషన్ సిబ్బంది హోలీ వేడుకలను నిర్వహించి రంగులను చల్లుకొని వేడుకలు నిర్వహించారు.

మెట్‌పల్లి: కులమతాలకు అతీతంగా చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ కలిసి జరుపుకునే హోలీ పండుగ అందరి జీవితాల్లో రంగులు నింపాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా పట్టణంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రతి ఒక్కరి జీవితాల్లో రంగులు నిండాలని పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య చిన్నాపెద్దా తేడా లేకుండా హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరుట్ల నియోజక వర్గంలోని ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడు తొలిగిపోయి మంచి గెలుపునకు సంకేతంగా జరుపుకునే హోలీ పండుగతో అందరి జీవితాల్లో రంగులు నింపాలన్నారు. హోలీ పండుగతో అన్ని వర్గాల ప్రజలు వారి పండుగలను సుఖ సంతోషాలతో జరుపుకోవలన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలు యువజన సంఘాలు, మహిళలు, చిన్నారులు ఆటపాటలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు.


మెట్‌పల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


మెట్‌పల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


రాయికల్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు


జగిత్యాలలో వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్ వసంత


వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంపీ అర్వింద్ కటౌట్లతో వేడుకల్లో పాల్గొన్న శ్రావణి


రాయికల్‌లో హోలీ వేడుల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


జగిత్యాలలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్


వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ, డీఎస్పీ, పోలీస్ అధికారులు


కోరుట్లలో హోలీ వేడుకలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్

జగిత్యాలరూరల్, మార్చి 25 : జగిత్యాల జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఆనందమయమైన జీవితం గడపాలని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంతసురేష్ ఆకాంక్షించారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో నిర్వహిస్తున్న నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు ఆకుల లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు పెండెం శ్రీను, కార్యదర్శి సంబారి మనోహర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సత్తన్న, చందు, గంగాధర్, గంగశేఖర్, సురేష్ గంగారాజం, రంజిత్, అంజయ్య పాల్గొన్నారు.

ధర్మపురిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం చుట్టూ ఉదయం కళాకారులు, లక్ష్మీ నరసింహ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి త్యాగరాజ చిత్రపటంతో ప్రదక్షిణాలు, నగర సంకీర్తన చేశారు. అనంతరం శేషప్ప కళావేదికపై ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, బొజ్జ సంతోష్‌కుమార్, మంత్రోచ్ఛరణల మధ్య ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ త్యాగరాజు, చాచం కిష్టయ్య చిత్రపటాలకు పూల మాల వేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం సంగీత విద్వాంసులు పంచరత్న గానాలు ఆలపించారు. కళాకారులను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఓరియంటల్ కళాశాల కార్యదర్శి సంగన భట్ల రామ కిష్టయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.


చాచం కిష్టయ్య చిత్రపటంతో ప్రదక్షిణలు చేస్తున్న కళాకారులు

విద్యార్థులకు ఫ్రీ బస్ ప్రయాణానికి కృషి

●సీఎం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్సీ హామీ
●నిజామాబాద్ ఎంపీ సీటు అడిగా.. ●ఇస్తే పోటీ చేస్తా ●ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాయికల్, మార్చి 25: కాంగ్రెస్ అధికారం చేపట్టగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ జర్నీ ప్రారంభించామని, తాను సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఆడ, మగ తేడా లేకుడా విద్యార్థులందరికీ ఫ్రీ బస్సు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. విలేక రులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు కరీంనగర్ ఎంపీ టిక్కెట్ ఆఫర్ చేశారని, అయితే ఇష్టం లేదని చెప్పి నిజామాబాద్ కావాలని అడిగినట్లు చెప్పారు. తనకు జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మంచి పట్టు ఉంటుందని, మిగతా చోట్ల కార్యకర్తల సహకారంతో విజయం సాధిస్తాననే దీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క హామీని అమలు చేస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ శ్రావణి వల్లనే తాను ఓటమి పాలయ్యాయని చెప్పారు. బీసీ కార్డు శ్రావణికి మంచిగా పని చేసిందని వివరించారు. శ్రావణి బీఆర్ఎస్ ఓట్లు చీల్చవచ్చని భావించామని, అయితే బీసీ ఓట్లు చీల్చి ఆ పార్టీకే మేలు చేసిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం వల్ల తనకు ఎంపీ సీటు ఇస్తే ఖచ్చితంగా విజయం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకర్గంలో మిషన్ భగీరథ ఫెయిల్ అయిందని, ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారని గ్రహించానని తెలిపారు. అందుకే మూలన పడేసిన ఫిల్టర్‌బెడ్ పథకాల పునరుద్ధరణకు నిధులను మంజూరు చేయించానని అన్నారు. నిజామాబాద్ ప్రజల్లో బీజేపీ పట్ల ఆదరణ తగ్గిందని, ప్రజలకు కాంగ్రెస్ పాలనపై నమ్మకం పెరిగిందని చెప్పారు. విద్యార్థు లందరికీ ఫ్రీ బస్సు ప్రయాణం కోసం సీఎం దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంలో సీఎంను ఒప్పించేందుకు తాను శాయాశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులుగావించి ఆలయం చుట్టూ రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచులు గంగారెడ్డి, నారాయణ గౌడ్, సామల్ల లావణ్యవేణు, నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రఘునాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారెస్పీ కాలువలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: రాయికల్ మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలో పడి మానసిక, శారీరక వైకల్యం గల జిల్లాల నవీన్ (28) అనే యువకుడు మృతి చెందాడు. నవీన్ గ్రామ శివారులోని చర్చికి ఆదివారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందినట్లు రాత్రి 8:30 గంటలకు గుర్తించారు. కాలువ వద్దకు మల విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని అన్న సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

రాయికల్, మార్చి 25: రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయికల్‌కు చెందిన సూర్య, కిరణ్, అభి, సన్నీతో పాటు మరి కొందరు మధ్యాహ్నం 12:15 గంటల ప్రాంతంలో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యుడు, ఆస్పత్రి సిబ్బందిపై దుర్భాషలాడుతూ బెదిరించారు. డ్యూటీ డాక్టర్ ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

ధర్మపురిలో ఉగ్రనారసింహుడి డోలోత్సవం

● వైభవంగా బ్రహ్మోత్సవాలు ● మొక్కులు తీర్చుకున్న భక్తులు



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి డోలోత్సవం



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో ఉగ్ర నారసింహుడి తెప్పోత్సవం



ధర్మపురిలో స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూలైను

ధర్మపురి, మార్చి 25: ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర) తెప్పోత్సవం, డోలోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, నవీన్ మధ్యాహ్నం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన స్వామివారలను కూర్చోబెట్టి, బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామ స్మరణ చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరు మహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామి వారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సనాతన సాంప్రదాయ రీతిలో అర్చకులు స్వామి వారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామి వారలపై బుకాగులాలు చల్లి కట్న కానుకలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. గతంలో కన్న భక్తుల సంఖ్య అధికంగా తగ్గి పోయింది. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో శోభిల్లింది. రాత్రివరకు ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్ సహా పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు ముత్తినేని మల్లేశం, బాదినేని సత్యనారాయణ, రాందేని మొగిలి, దాసరి పురుషోత్తం, ఏదులాపురం మహేందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్, పసుపునూటి శ్రీకాంత్, మాదాసు మల్లేష్, లసెట్టి సుజాత, కొమురెల్లి పవన్ కుమార్, నేదునూర్ శ్రీధర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్య వైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, పట్టణ ఆర్య వైశ్య, వర్తక సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ, పుట్ట బంగారం నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామివారల కల్యాణ, తెప్పె, డోలోత్సవాలను నిత్యం వేలాది మంది భక్తులు తిలకించారు. అన్నదానం సమయంలో శెరిపల్లి కావేరి అనే భక్తురాలు బ్యాగ్, ఫోన్, పోగొట్టుకుంది. హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌కు దొరకగా భక్తురాలు ఆచూకీ కనుగొని అమెకు అప్పగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాల వద్ద లోక క్షేమార్థం సుదర్శన హోమం నిర్వహించారు. ఐదవ రోజు ఆలయానికి రూ 11,26,000 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.4,84,463 లభించగా లడ్డు, ప్రసాదాల ద్వారా రూ. 4,94,885 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 1,46,652 విరాళాలు సమర్పించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మపుష్కరిణి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవం, సాయంత్రం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయి.

కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్

మల్యాల, మార్చి 25: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఈవో వెంకటేష్‌పై దేవాదాయ శాఖ కమిషనర్ గత శనివారం సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టగా ఉద్యోగులు, అర్చకులు అభినందించారు

యవతిని ట్రాప్ చేసిన ఏఎస్సై వీఆర్‌కు అటాచ్

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఇబ్రహీంపట్నం, మార్చి 25: ఇబ్రహీంపట్నం ఏఎస్సై రాములుపై ఉన్నతధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో 'ఠాణాకు వచ్చిన యువతిని ట్రాప్ చేసిన ఏఎస్సై' కథనం ప్రచురితం కాగా జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ స్పందించారు. ఏఎస్సై వ్యవహారం సీరియస్‌గా తీసుకుని చర్యలు చేపట్టారు. ఏఎస్సై వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయంశం కావడంతో ఏఎస్సై రాములును జిల్లా హెడ్ క్వార్టర్ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సమగ్ర విచారణ అనంతరం ఏఎస్ఐపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఠాణాకు వచ్చిన మహిళలకు భద్రత కల్పించాల్సిన పోలీస్‌లే ఈ విధంగా ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతధికారులు దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్/కోనరావుపేట, మార్చి 25: భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జరిగింది. సిరిసిల్ల పట్టాణానికి చెందిన గూడూరు సాగర్ (26) కారు డ్రైవర్‌గా పనిచేసున్నాడు. మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన గూడూరు అనూష, సాగర్ ఇరు కుటుంబాలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. పిల్లలు పుట్టకపోవడంతో పాటు సరైన కూలి పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాడు. సాగర్ తల్లిదండ్రులు చంద్రకళ, బాబు దంపతులు ఉపాధి కోసం కోనరావుపేట మండలం కొలనూర్‌లోని ఓ ఇంటిలో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో పాటు పిల్లలు పుట్టడం లేదని 20 రోజుల క్రితం సాగర్‌తో భార్య అనూష గొడవ పడి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తల్లిదండ్రులు ఉంటున్న కొలనూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడే నిద్రించి తెల్లవారుజామున వారు ఉంటున్న ఇంటిపై ఉన్న సలాకకు చీరతో ఉరేసుకున్నాడు. సాగర్ తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మరోవైపు పండుగ పూట మిత్రుడు సాగర్ చనిపోవడంతో స్నేహితులతో పాటు ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

● రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మంథని, మార్చి 25: స్థానిక సీఆర్‌కే అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెం. 306లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు ఈ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్నారు. ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో అతని భార్య శ్రీలత కేకలు వేసుకుంటూ బయటకు వచ్చారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంథని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం, ఫైర్‌మెన్ శ్రీనివాస్, డ్రైవర్ కం ఆపరేటర్ రమేష్, కోండ్ర నాగరాజు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 50 వేల నగదు, రూ. 1.50 లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది.

వేములవాడ రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 25: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన త్రిరాత్రి ఉత్సవాలు

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న త్రిరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిసాయి. శివకల్యాణ మహోత్సవాలకు ముందుగా మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఉదయం, సాయంత్రం రాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణ మండపం ఊయలలో ఉంచి డోలోత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివకల్యాణోత్సవాలు

ఈ నెల 27వ తేదీ బుధవారం నుంచి శివకల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 28వ తేదీ గురువారం పార్వతీ రాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● హోలీ వేడుకల్లో విషాదం

కరీంనగర్ క్రైం, మార్చి 25: అప్పటి వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద కేళిలో మునిగి తేలిన ఆ యువకులు ఇద్దరు నిమిషాల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. హోలీ సంబరాలు చేసుకున్న స్నేహితులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలుసుకుని తోటి స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హోలీ పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాధం నింపింది. పోలీసులు, మృతుల స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం...

కరీంనగర్ శివారులోని మానేరు బైపాస్ రోడ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న పాను గంటి కృష్ణ వంశీ(24) అక్కడికక్కడే మృతి చెందగా గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న పాళ్ల శివకుమార్(24) ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. కృష్ణవంశీ, పాళ్ల శివకుమార్‌లు సోమవారం ఉదయం నుంచి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్నేహితులతో కలిసి భోజనాలు ముగించారు. కృష్ణవంశీ, శివకుమార్ సాయంత్రం 6 గంటలకు జ్యోతినగర్‌లోని స్నేహితుడి ఇంటి నుంచి అల్గునూర్‌కు బైక్‌పై వెళుతుండగా ఐటీ టవర్ వద్ద బైక్ రోడ్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఇద్దరు డివైడర్‌పై ఉన్న సైన్‌బోర్డు స్తంభానికి తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణవంశీ అక్కడికక్కడే మరణించగా శివకుమార్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించాడు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. మానకొండూర్ మండలం గద్దెపాకకు చెందిన కృష్ణవంశీ ప్రస్తుతం శ్రీనగర్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కృష్ణవంశీ పారామిలటరీ ఉద్యోగం కోసం హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ వారం రోజుల కిందటే కరీంనగర్‌కు వచ్చాడు. ఆయన తండ్రి పెయింటర్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటుండగా తల్లి వంట పనులు చేస్తూ జీవిస్తున్నది. ఒక సోదరుడు ఉన్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం



కృష్ణవంశీ(ఫైల్)



శివకుమార్ (ఫైల్)

రొంపికుంటకు చెందిన శివకుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్నాడు. హోలీ కావటంతో కృష్ణవంశీ, శివకుమార్‌లు స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బైక్‌పై వెళుతూ మృత్యువాత పడ్డారు. కృష్ణ వంశీ, శివకుమార్‌ల మరణవార్త తెలుసుకున్న వారి స్నేహితులు, బంధు వులు ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.



గుంపులుగా పంట చేనులోకి వెళ్తున్న కోతులు

వానర 'దండయాత్ర'

మల్యాల, మార్చి 25: సమూహాలుగా గ్రామాలు, పంట చేలపై దండయాత్ర చేస్తున్న కోతులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద అధికం కాగ పంట చేలను విడిచి పెట్టడం లేదు. గుంపులుగా పంటలపై దాడి చేస్తూ నష్టం చేస్తున్నాయి. దీంతో కోతులను నివారించలేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మల్యాల శివారులో గుంపులుగా వచ్చిన కోతులు పంటలపై దాడి చేశాయి. వాటిని తరమడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

షార్ట్ సూర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఈరీ కైలాసం ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుడు కైలాసం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో సామగ్రితో సాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే బీరువాలో ఉన్న బంగారు అభరణాలు మంటల్లో కరిగిపోయినట్లు బాధితులు తెలిపారు. బీరువాలో ఉన్నా రూ. 30 వేలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుంటుంబాన్ని ఎంపీపీ పడిగెల మానసరాజు పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్ బాధితులను పరామర్శించారు.



కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న నాయకులు

రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 25: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్ తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్సూరెన్స్, నెక్సా మోటార్స్, బీవీఆర్ సొల్యూషన్స్,శాశ్వత డెవలపర్స్, ఆనంద నిలయం డెవలపర్స్ వారు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రాడ్యుయేట్, పీజీ 2021,22,23 ప్రస్తుత చివరి సెమిస్టర్ చదువుతున్న కళాశాల, ఇతర కళాశాలల అభ్యర్థులు మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. అర్హులైన వారు వారి రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళా గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, కాశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ వద్ద జరుగుతుందని తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

రాయికల్, మార్చి 25: హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని బహిర్భూమికి వెళ్లిన యువకుడు బావిలో కాలుజారి పడి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన నర్ర నగేష్ (21) అనే యువకుడు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. వీరాపూర్ రోడ్డులోని వ్యవసాయ బావి వద్దకు బహిర్భూమికి వెళ్లి బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. స్నేహితులకు ఈత రాకపోవడంతో వెంటనే యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి బావిలో గాలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వద్దకు చేరుకుని రెండు గంటల పాటు గాలించగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి



రాజకుమారి (ఫైల్)

మల్యాల, మార్చి 25: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మల్యాల మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజకుమారి(43) అనే మహిళ ఈ నెల 22న కుటుంబసభ్యులతో కలిసి కారులో వెలుతుండగా బెజ్జంకి సమీపంలో లారీ ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు దాదాపు రూ.6లక్షలకు పైగా అవసరం కాగ నిరుపేద కుటుంబం కావడంతో ఆమె కొడుకుతో పాటు పలువురు యువకులు సోషల్‌మీడియా ద్వారా సాయం కోరారు. దాతలు సాయం అందిస్తున్న తరుణంలోనే పరిస్థితి విషమించి రాజకుమారి మృతి చెందింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

మల్యాల, మార్చి 25: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో గల వీఆర్‌కే కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గరికి గాయాలు అయ్యాయి. కొడిమ్యాలకు చెందిన దండుగుల శేఖర్ తన భార్య ఇద్దరు చిన్నారులతో కలిసి ద్విచక్రవాహనంపై వెలుతుండగా వీఆర్‌కే కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. అదుపు తప్పి వస్తున్న కారును తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఢీకొనడంతో శేఖర్‌తో పాటు అతని కూతురు సాయివర్షిత, కుమారుడు రుద్రాంశ్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సాయివర్షిత కొద్ది దూరంలో ఎగిరిపడడంతో తలకు గాయాలు కాగా గాయపడిన వారిని చికిత్స కోసం 108లో జగిత్యాలకు తరలించారు.

యువకుడి ఆకస్మిక మృతి

గంగాధర, మార్చి 25: గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన వేముల మురళి(42) సోమవారం ఇంట్లోనే ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే మురళి మృతికి షాపు యాజమాని కారణమంటూ అతడి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేశారు. దీనిపై ఎస్ఐ కిరణ్‌రెడ్డిని వివరాలు కోరగా.. మధురానగర్‌కు చెందిన వేముల మురళి సోమవారం వేకువ జామున నిద్రలోనే మృతి చెందాడు. తెల్లవారినా లేవకపోవడంతో అతని భార్య గౌతమి లేపినా ఎలాంటి స్పందన లేదు. విషయాన్ని మురళి అన్న రమేష్, తల్లికి తెలపగా వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు.మృతుడి అన్న రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా మురళికి చెందిన భూమి విషయంలో పంచాయతీ జరుగుతోంది. భూమి విషయం ఎప్పటికీ తెగకపోవడంతో మానసికంగా ఆందోళన చెంది మృతి చెంది ఉంటాడని బంధువులు, గ్రామస్థులు పేర్కొంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

● తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

జగిత్యాలరూరల్, మార్చి 25: జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో హోలీ పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన రమ అనే మహిళ, అదే గ్రామానికి చెందిన బోగు రాకేష్‌ల మధ్య పాత గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం గ్రామంలో యువకులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈక్రమంలో బోగు రాకేష్ అనే యువకుడు మేడిశెట్టి రమ ఇంటిలోపలకి కోడి గుడ్డు విసిరారు. ఇదే విషయమై తన ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరివేశావు అని రాకేష్ ను రమ కుమారుడు రిషి నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య మాట, మాట పెరిగి గొడవకు దారి తీసింది. రిషి, రాకేష్ లు ఇద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గొడవను ఆపేందుకు వెళ్లిన రమపై రాకేష్ మెడపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. రమ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ విచారణ చేపట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మాయిలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం

● మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి25: ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక ధారుఢ్యం అవసరమని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సోమవారం నగరంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలలో కరాటే శిక్షకుడు పుల్లూరి శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులు వివిధ స్థాయి బెల్టులను సాధించినట్లు ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శారద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యుద్ధ విద్య ప్రాముఖ్యతను గుర్తించి దీనికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహం అందేలా కృషిచేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత



అధికారులు పట్టుకున్న ఇసుకలారీ

ముత్తారం, మార్చి25: మండలంలోని ఓడేడులో మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా మూడు లారీలలో ఇసుక నింపి తరలిస్తుండగా లారీలు దిగబడ్డాయి. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సోమవారం సిబ్బందితో వచ్చి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే మూడు లారీలను ఒక జేసీబీని సీజ్ చేసి పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 25 : కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులు వేల్పుల వెంకటరమణ, వేల్పుల తిరుపతిలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 25: మండ లంలోని వేముల కుర్తి గ్రామంలో సోమవారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగిం ది. అర్చకులు చక్ర పాణి నరసింహ మూర్తి చార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రోత్సవాల మధ్య కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యం లో అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దేశెట్టి మమత, మాజీ సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, మాజీ ఎంపీటీసీ పెంట లక్ష్మీ నిర్మల్ వీపీ గుడ్ల రమకృష్ణ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎండపల్లి, మార్చి25: మండలంలోని గుల్లకోట గ్రామంలో సోమవారం శ్రీ వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా ఎడ్లబండ్ల పోటీలు సాగాయి. పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతిగా పావు తులం బంగారం అచ్చలాపూర్‌కు చెందిన పొట్లపల్లి సాగర్, రెండో బహుమతి పంచాల లక్ష్మణ్, మూడవ బహుమతి పొన్నం రిత్విక్ గుల్లకోట బహుమతులు పొందారు. మొదటి బహుమతి దాత సింహాచలం పల్లవి-జగన్, రెండో బహుమతి దాత భూసారపు రమేష్, గొల్లపల్లి శంకర్, మూడవ బహుమతి దాత అంకమళ్ల శోభన అందజేశారు. సాన మారుతి, గుండ గంగయ్య పాల్గొన్నారు.

యజమానులు నిబంధనలు పాటించాలి



పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల, మార్చి 25 : సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసే యజమానులు నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. వాహనం ద్వారా వ్యర్థాలను తరలించే యజమానులు నిబంధలకు విరుద్ధంగా వ్యర్థాలను రోడ్డు పక్కన పారవేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. సెప్టిక్ ట్యాంక్ నుంచి తీసిన వ్యర్థాలను కోరుట్లలోని ఎఫ్ఎస్‌టీపీ యూనిట్ నందు అప్పగించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి చర్యలు తప్పవని తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసే వాహన యజమానులు తప్పని సరిగా మున్సిపల్‌లో లైసెన్స్‌ను పొందాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం




ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, మార్చి 25 : పట్టణంలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి మంత్ర హవనం రథోత్సవం నిర్వహించారు. రథోత్సవానికి మంగళ హారతులతో మహిళ, కోలాటాలు వేస్తూ యువతీ, యువకులు స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహకుడు బుర్గ రామస్వామి గౌడ్, అర్చకులు సముద్రాల రామా చార్యులు, ఇందూరి మధుసూదనాచారి, శ్రీనివాస్ చార్యులు, శివకుమరా చార్యులు, మాదవాచార్యులు, శ్రీకాంత చార్యులు, సభ్యులు చౌటుకూరి అంజయ్య గౌడ్, ముత్యాల గంగాధర్, వెంకటేశ్వర రావు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కోరుట్ల రూరల్, మార్చి 25 : క్రీడల్లో గెలు పోటములు సహజమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సుఖేందర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని యూసు ఫ్‌నగర్ గ్రామంలో నిజామాబాదు ఎంపీ అర్విం ద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీపీఎల్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో విజేత జట్టుకు నగదుతో పాటు కప్పు అందించి అభినందించారు. రూ. లక్ష ప్రైజ్ మనీ ఎంపీ అర్వింద్ బహూకరించంగా విజేతలకు బహుమతులతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. మొదటి స్థానంలో నిలిచిన యూనివర్సిటీ రైడర్స్ జగసాగర్ టీంకు రూ. 40,000ల చెక్కుతో పాటు కప్పును అందించారు. రెండో స్థానంలో నిలిచిన కేఎస్ఆర్ గార్డెన్స్‌క్ రూ. 20,000 చెక్కును, మూడవ స్థానంలో నిలిచిన రూ. గోపిడి జీవ న్‌రెడ్డి టీం, నాలుగోవస్థానం నిలిచిన కాను గంటి సురేష్ టీంలకు రూ. 10,000 చెక్కును అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తుక్కారాంగౌడ్, రమేష్, సాయికుమార్ పాల్గొన్నారు.



విజేతలకు చెక్కు అందిస్తున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సుఖేందర్ గౌడ్, నాయకులు

వాడవాడలా హోలీ వేడుకలు

వెల్గటూర్, మార్చి 25: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం హోలీ సంబరాలు జోరుగా హుషారుగా నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి హోలీ సంబరాలు నిర్వహించారు. విప్ అడ్లూరి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంబరాలలో పాల్గొని రంగులు పూసుకుంటూ ఆనందించారు. చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకొని కేరింతలు కొట్టారు. ఉరకలెత్తే ఉత్సాహానికి కుర్ర కారు జోరుగా హుషారుగా రంగుల పండుగను ఆనందంగా జరుపుకున్నారు. యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఉల్లాసంగా కనిపించారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వెల్గటూర్‌లో జడ్పీటీసీ సుధా రామస్వామి ఇంటిలో హోలీ వేడుకలు నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీపీ లక్ష్మి లింగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ మండల ప్రజలకు హోళీ శుభాకాంక్షలు తెలిపారు.

మల్యాల: రంగుల పండుగ హోలీ వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువతీయువకులు ఒకరికొకరూ రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మల్యాల సీఐ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లోనూ వేడుకలు జరుపుకున్నారు. పలువురు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం, వేములకుర్తి, యామపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలి పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే చిన్నారులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు రంగులు చల్లుకుని హోలి వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రం నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన యువకులు కేరింతలు కొడుతూ రంగులు పూసుకున్నారు. పల్లెల్లో వీధులన్నీ రంగులమయంగా మారాయి.

కొడిమ్యాల : కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని అంగడి బజారు, బస్టాండ్ ప్రాంతాలలో యువతి-యువకులు కేరింతలు కొడుతు ఒక్కరిపై రంగులు చల్లుకుంటు ఉత్సాహంగా హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలోని బస్టాండ్ ప్రాంతాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో హోలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల యువతి యువకులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వెల్గటూర్‌లో హోలీ సంబరాలలో యువకులతో విప్ అడ్లూరి

పెగడపల్లి : మండలంలో సోమవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు అన్ని రంగాలలో చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకుని పండుగను ఆహ్లాదకరంగా జరుపుకున్నారు. పౌర్ణమి హోలీని పురస్కరించుకుని మండలంలోని రాంబద్రునిపల్లి సాయిబాబా ఆలయంతో పాటు, బతికెపల్లిలోని భక్త మార్కండేయ ఆలయంలో అన్నదానాలు నిర్వహించారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ పర్వదినం పురష్కరించుకొని సోమవారం ఘనంగా హోలీ సంబరాలను నిర్వహించారు. గ్రామాల్లో యువత, మహిళలు, చిన్నారులు, ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీజే సౌండ్‌లు పెట్టుకొని నృత్యాలు చేశారు. ఆనంద కేరింతలు కొడుతూ హోలీ జరుపుకున్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. సోమవారం హోలీ పండుగ సందర్భంగా గ్రామాల్లోని పలు చోట్ల కామదహనాలు జరిపి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు, చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని రంగాల ప్రజలు హోలీ ఆడారు. ఈ వేడుకల్లో భాగంగా మహిళలు, యువత, చిన్నారులు ఆటపాటలతో ఆడుతూ ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ హోలి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



బీర్‌పూర్‌లో వేడుకల్లో యువకులు

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం రంగుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండుగ సందర్భంగా పలువురు ఒకరికి ఒకరు రంగులను చలుకొని ఆనందంగా కేరింతలు కొడుతూ వేడుకలు జరుపుకున్నారు. మహిళలు పాటలు పాడుతూ చప్పట్లు వేస్తూ హోలీ జరుపుకున్నారు.

జగిత్యాల : గొల్లపల్లి మండలంలో హోలీ సంబరాలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ పండగను పురస్కరించుకుని యువతీయువకులు, చిన్నారులు, చిన్నాపెద్ద తేడా లేకుండా రకరకాల రంగులు చల్లుకుంటూ చేసిన హంగామాతో పల్లెలు హోరెత్తిపోయాయి. యువకులు రోడ్లపై నృత్యాలు చేస్తూ, బైక్ ర్యాలీలతో హోలీ పండగను ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలతో హోరెత్తించారు. హోలీ పండగ పర్వదినంను పురస్కరించుకుని పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

బీర్‌పూర్: మండలంలోని పలు గ్రామాలలో సోమావారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజా ప్రతినిధు లు, నాయకులు, మహిళలు, చిన్నారులు రంగులు పూసుకుంటు ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలపుకొని స్వీట్లు పంపిణి చేసుకున్నారు. ఎంపీపీ మసర్తి రమేష్, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, వైస్ ఎంపీపీ లక్ష్మన్‌రావ్, ఎంపీటీసీలు ఆడెపు మల్లీశ్వరి తిరుపతి, సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్, తాజ మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో రంగుల చల్లుకుంటున్న చిన్నారులు



కొడిమ్యాలలో హోలీ వేడుకలు నిర్వహించుకుంటున్న యువకులు



మల్యాలలో జరిగిన హోలీ వేడుకలలో యువకులు

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, మార్చి 25: అధికారం ఎవరికీ శాశ్వతం కాదని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ ధర్మపురి ముఖ్య నాయకుల పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒక సారి గెలుస్తామని, మరొక సారి ఓడిపోతామని, కార్యకర్తలు అధైర్య పడరాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం పది ఏళ్ల వెనుక బడి పోయిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పరిపాలనలో సంక్షేమ పథకాలు గురించి చర్చ జరగాలన్నారు. రైతులకు పంట పొలాలకు నీరందక గోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మచ్చలేని ప్రజా నాయకుడిగా ప్రజల మధ్య ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజా క్షేత్రంలో భంగపాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామయ్య, రైతుబంధు మండల అధ్యక్షులు భీమయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

కన్నుల పండువగా వేణుగోపాల స్వామి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న జీవన్ రెడ్డి

రాయికల్, మార్చి 25: మండలంలోని చింత లూరు గ్రామంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి కల్యాణం సోమవారం కన్నుల పండువగా జరిగింది. దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి పురోహితులు చెరుకు మహే శ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఓరు గంటి భూమారావు, తాజా మాజీ సర్పంచ్ అనుపురపు శ్రీనివాస్, కార్యదర్శి వినోద్, ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రావు, రమేష్, బాపురావు, ప్రజలు పాల్గొన్నారు.

తక్కళ్లపల్లిలో వైభవంగా వెంకన్న రథోత్సవం

కథలాపూర్, మార్చి 25 : మండలంలోని తక్కళ్లపల్లిలో సోమవారం ఉదయాత్పూర్వం శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభ వంగా జరిగింది. వేకువ జామున చన్నీటి స్నానాలు ఆచరించి తడి బట్టలతో స్వామి వారి మొక్కులు తీర్చుకున్నారు. పుర వీధుల వెంట రథంలో స్వామివారిని అర్చకుల మంత్రోచ్ఛరణ ల మధ్య డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. అర్చకులు చిలకమర్రి ఆనంద్ నేతృత్వంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. బంతులాట కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా సత్యం, మాజీ సర్పంచులు మొలిగె లక్ష్మీశ్రీనివాస్, మేడిపల్లి సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మేడిపల్లి ఆదిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 25: దాడికి పాల్పడడంతోపాటు చంపుతామని బెదిరించిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన నర్సింలు, డేవిడ్‌పై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గుండం జలపతిరెడ్డి గ్రామ శివారులో జీమార్ట్ సూపర్ మార్కెట్ నిర్వహిస్తున్నాడు. నర్సింలు, డేవిడ్ బీరు సీసాలతో దుకాణంలోకి వెళ్లి కోడి గుడ్లు కావాలని అడిగారు. కోడి గుడ్లు లేవని జలపతిరెడ్డి పేర్కొనడంతో ఆగ్రహించిన ఇద్దరు అసభ్యపదజాలంతో దూషించారు. అక్కడే ఉన్న పూలతొట్టితో దాడి చేశారు. బాధితుడు జలపతిరెడ్డి ఫిర్యాదుతో నర్సింలు, డేవిడ్‌పై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ అధికారి కిషన్‌రావు వివరించారు.

వైభవంగా గంబీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర

● కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 25 : మండలంలోని గంభీర్‌పూర్‌లో సోమవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తజనం స్వామి వారి సన్నిధికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వోరుగంటి మాధవాచార్యుల నేతృత్వంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. చుట్టుపక్కన గ్రామాలైన తాండ్ర్యాల, బొమ్మెన, బీమారం మండలం రాజలింగంపేట, రత్నాలపల్లి, ఈదులలింగంపేట, దేశాయిపేట గ్రామాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించుకుని కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ జవ్వాజి రేవతిగణేశ్, మాజీ సర్పంచ్ పోతు సింధూజరాజశేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి చౌదరి, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదిరెడ్డి బాపురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రారంభమైన ఎల్లమ్మ పట్నాలు

ఎండపల్లి, మార్చి25: మండలంలోని కొత్తపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల కార్యక్రమం, సోమవారం అమ్మవారికి జోగు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం అమ్మవారి బోనాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్య క్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య శివారు వివాదం

ఎండపల్లి, మార్చి 25: మండలంలోని గుల్లకోట, చెర్లపల్లి గ్రామాల మధ్య ఏర్పడ్డ శివారు వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. సోమవారం చెర్లపల్లి గ్రామస్థులను గుల్లకోట గ్రామస్థులు తమ ఊరి శివారులో ఉపాధి హామీ పని చేయవద్దని అడ్డుకున్నారు. గంట పాటు రోడ్డు వద్ద రెండు గ్రామ ప్రజలు చర్చించుకున్నారు. మూడు రోజుల క్రితం చెర్లపల్లి గ్రామస్థులు ఎక్కల్‌దేవ్ గుట్ట సమీపాన ఉపాధి హామీ పనులు చేస్తుండగా తవ్వకా లలో దేవుడి విగ్రహాలు బయటపడ్డాయి. దానికి చెర్లపల్లి గ్రామస్థులు తమ గ్రామంలో వెలువడ్డాయని ప్రచారం చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన గుల్లకోట గ్రామస్థులు సోమవారం చెర్లపల్లి గ్రామస్థులను ఉపాధి పని చేయని వ్వలేదు. తమ గ్రామంలో తామే పని చేసుకుంటామం టూ గుల్లకోట గ్రామస్థులు ఏకమయ్యారు.

నూతన కార్యవర్గం

కథలాపూర్, మార్చి 25 : మండలంలోని పోతారంలో సోమవారం పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, రాష్ట్ర కాంగ్రెస్ చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అతికెం రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా గాజం నవీధర్, నాగుల సాయి కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఇంద్రాల సిద్ధార్థ్, యూత్ అధ్యక్షుడిగా ఉబ్బరవేని రమేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా వంగ గంగాధర్, క్రీడా విభాగం అధ్యక్షుడిగా తలారి రాహుల్, ఎన్ఆర్ఐ సెల్ కార్యదర్శిగా సిరికొండ సురేశ్‌లను నియమించారు.

నియామకం

మల్యాల, మార్చి 25: ధర్మ స్టూడెంట్ యూనియన్ మండల కన్వీనర్‌గా మల్యాల ప్రభాస్ నియమితులయ్యారు. సోమవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో కన్వీనర్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ సదానందం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ప్రభాస్ తెలిపారు. కాగ నూతన మండల కన్వీనర్‌ను పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శ

రాయికల్, మార్చి 25: రాయికల్ పట్టణంలోని అశోక్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సతీష్ సోదరుడు మరణించగా పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర సహకార సొసైటీ చైర్మన్‌కు సన్మానం

కథలాపూర్, మార్చి 25 : రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.